క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో ఆర్కే రోజా



స్వామి ప్రసాదం అందుకుంటున్న మాజీ మంత్రి రోజా

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని మంగళవారం మాజీ మంత్రి రోజా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం పలికారు. స్వామి వారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

పదిలో పట్టుబట్టి చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ

పూతలపట్టు(కాణిపాకం): పదిలో పట్టుబట్టి చదవాలని, జరగబోయే పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వెంకటరమణ ఆకాంక్షించారు. పూతలపట్టు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ముత్తిరేవుల పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పదిలో పట్టుదలతో చదవాలన్నారు. రానున్న పబ్లిక్ పరీక్షలను అనుగుణంగా చదవాలన్నారు. మంచి మార్కులు తెచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదిగేలా లక్ష్యం నిర్దేశించుకుని ముందుకుపోవాలన్నారు.

తప్పిన పెను ప్రమాదం



విద్యుత్ లైన్‌పై పడిన వాయుగొట్టాలు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గిరింపేటలో మంగళవారం విద్యుత్ ప్రమాదం తప్పింది. బ్రాహ్మణవీధిలోని ఓ దుకాణానికి చెందిన వాయుగొట్టాలు విరిగి కరెంటు లైన్‌పై పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. అంతేకాకుండా గొట్టాలు పడడంతో లైన్ ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ వివేకానందరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వాయుగొట్టాలను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

సకాలంలో పిల్లలకు టీకాలు



ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. మంగళవారం ఆశావర్కర్లకు పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. విటమిన్‌-ఏ సిరప్‌ను పిల్లలకు తొమ్మిదవ నెలలో మొదటిసారి, ఆ తర్వాత ప్రతి ఆరు నెలలకోసారి ఐదేళ్ల వరకూ ఇస్తూ ఉండాలన్నారు. గర్భవతులుగా ఉన్న వారిని 12 వారాల్లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి వారం గ్రామాల్లో వేస్తున్న టీకాల గురించి వివరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లేటప్పుడు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న చెన్నకేశవులునాయుడు

గుడిపాల: గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్లయితే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తండ్రి, బీజేఎం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చెన్నకేశవులు నాయుడు అన్నారు. ముట్టుకూరుపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారానికి మంగళవారం బోరు డ్రిల్లింగ్ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

ఈ రోజు

విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాలలోని వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

సూర్య, చంద్ర ప్రభలపై చిద్విలాసం



సూర్యప్రభ వాహనంపై మొగిలీశ్వరుడు, కామాక్షమ్మ



చంద్రప్రభ వాహనంపై స్వామి, అమ్మవారు

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా పదవ రోజు మంగళవారం ఉదయం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. తొలుత స్వామి, అమ్మవారి మూలవర్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి, ఆలయ మాడవీధులలో ఊరేగించారు. సాయంత్రం వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంపై విహరిస్తూ కటాక్షించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. చివరగా స్వామి,అమ్మ వారికి శయనోత్సవం నిర్వహించారు.

సూర్య ప్రభ వాహనసేవకు నలగాంపల్లె కేఎస్‌ఎన్ ఫుడ్స్ యాజమాని నరసింహులునాయుడు, మునెమ్మ కుటుంబ సభ్యులు, వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణానికి మొగిలి దేవస్థానం, చంద్రప్రభ వాహన సేవకు బంగారుపాళెంకు చెందిన ప్రదీప్, రమ్య, కేబీఆర్ మొబైల్ ప్లాజా నిర్వాహకులు, శయనోత్సవానికి మొగిలి బ్రాహ్మణ సంఘం, అర్చకులు, పురోహితులు ఉభయ దారులుగా వ్యవహరించారు. కార్య క్రమంలో ఆలయ ఈఓ మునిరాజ , సిబ్బంది, ప్రధాన అర్చకులు రెడ్డెప్ప గురుకుల్, అర్చకులు విశ్వనాథ గురుకుల్, హరికేష్ గురుకుల్, మంజునాథ్ గురుకుల్, పవన్ గురుకుల్, సోమశేఖర్ గురుకుల్, దండపాణి గురుకుల్ పాల్గొన్నారు.

నేడు తెప్పోత్సవం

బుధవారం ఉదయం స్వామి, అమ్మ వారికి అభిషేకం, రాత్రి తెప్పోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

మందుబాబులకు రూ.3.10లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 31 మందికి రూ.3.10 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులు నిర్వహించిన వాహనాల తనిఖీలో పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 31 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

డెంగీపై అప్రమత్తం

చిత్తూరు రూరల్(కాణిపాకం): డెంగీ వ్యాప్తిపై అప్రమత్తంగా వ్యవహరిస్తూ నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆదేశించారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం సబ్‌యూనిట్ అధికారులతో ఆయన సమీక్షించారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి రసాయనాల స్ప్రే, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించాలన్నారు. డెంగీ కేసులు నమోదైతే ఆ ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

– జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు



హెల్మెట్ అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ద్విచక్ర వాహన చోదకులు డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు అన్నారు. హెల్మెట్ ధారణపై మంగళవారం చిత్తూరు మండలం పి.అనంతాపురంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యంఎస్ భారతి, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్, రామకృష్ణారెడ్డి, కార్మిక అసిస్టెంట్ కమిషనర్ ఓంకార్, ద్విచక్రవాహనదారులకు హెల్మెట్లు అందజేశారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకపోవడంతో ఎక్కువ మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం మంది ద్విచక్రవాహనదారులే మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రావిటా ఇండియా లిమిటెడ్ యాజమాన్యం సౌజన్యంతో ఫ్యాక్టరీ కార్మికులకు పెద్ద మొత్తంలో హెల్మెట్లు పంపిణీ చేశారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

– రాష్ట్ర ఫుడ్ కమిషనర్ విజయప్రతాప్‌రెడ్డి



సరకులను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాప్‌రెడ్డి

బంగారుపాళెం: సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషనర్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించి పలుచోట్ల తనిఖీ చేశారు. తొలుత మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ దండువారిపల్లెలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి, అక్కడ స్టాక్ వివరాలను డీలర్ సుధాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడారు. సరకులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, లేదా? అని ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు సరఫరా చేస్తున్న సరకులు ఏవిధంగా తీసుకువెళ్తున్నారో తెలుసుకున్నారు. అనంతరం బంగారుపాళెంలోని ఏపీ ట్రైబల్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న భోజనంపై గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న పిల్లల భవితకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పిల్లలకు పెట్టే భోజనంలో దుర్వినియోగానికి పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీఓ 21,31 రద్దు చేయాలని ఆందోళన



గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఆటో డ్రైవర్లకు భారీగా జరిమానాలు పెంచి నష్టం కలిగించే జీవో నంబర్ 21,31 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐటీయూసీ నాయకులు గాంధీవిగ్రహం వద్ద ఆందోళన చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 894 గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. ఆటో, మోటార్ వాహనాల ఎఫ్‌సీలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ ప్రకారం వాహనమిత్ర డ్రైవర్లకు 15 వేల రూపాయల సాయం అందించాలని, అలాగే వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్, విడిభాగాల ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, దాసరి చంద్ర, మణి, రమాదేవి, రఘు, నాయకులు ప్రకాష్, ఉమాపతి, నూర్‌బాషా, యుగంధర్, నటరాజన్, కరీం బాషా, జయరామన్, క్రాంతి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గర్భిణులు, పాలిచ్చే తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు దూరం చేయవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కె.పట్నంలో పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

చెర్లోపల్లె, పట్నంలో..

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె, కె.పట్నంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కె.పట్నంలో డాక్టర్ కేశవనారాయణ, పట్నంలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.. రోగులకు ఆరోగ్య సూత్రాలు గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విహారయాత్రలకు నిధులు మంజూరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విహారయాత్రలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విహారయాత్రలకు సంబంధించిన నిధులను సంబంధిత హెచ్‌ఎంలకు జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో 186 మంది విద్యార్థులను విహారయాత్రలకు తీసుకెళ్లవచ్చన్నారు. రాష్ట్ర పరిధిలో విహార యాత్రకు వెళ్తే ఒక్కో విద్యార్థికి రూ.200, రాష్ట్ర పరిధి దాటి వెళ్తే ఒక్కో విద్యార్థికి రూ.2 వేలు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ నెల 5 వ తేదీన జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్ పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సీఆర్‌సీ, మండల, డివిజన్ స్థాయిల నుంచి విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను తీసుకొచ్చి ఆవిష్కరిస్తారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందే విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు ఏపీసీ చెప్పారు.

ప్రజారోగ్యమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశాడేలో భాగంగా ఆయన ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్సీడీ, కుష్టు రోగుల గుర్తింపు సర్వే పక్కాగా చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను ఆశావర్కర్లు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణులకు 4వ నెల నుంచి ప్రసవానంతరం బిడ్డకు ఏడాది వచ్చే వరకు మాతా–శిశు ఆరోగ్య సంరక్షణ, కిల్కారి మెస్సేజ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. చిన్న వయసులో గర్భధారణ వల్ల కలిగే అనర్థాలు, ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి చెప్పాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఆదిలక్ష్మి, పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

పెద్దపంజాణి: స్థానిక మండల కేంద్రంలో ఎస్‌ఐ సహదేవి మంగళవారం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నూతన వాహనాల చట్టం గురించి వివరించారు. నూతన వాహన చట్టం ద్వారా హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా లేకపోవడం, శబ్ద కాలుష్యం చేయడం, మైనర్లు, మద్యం తాగి వాహనాలు నడపడం వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే విధించే జరిమానాల గురించి తెలిపారు. అదేవిధంగా వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఐదు ట్రాక్టర్లు, రెండు హిటాచీలు సీజ్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి టాస్క్‌ఫోర్స్: తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లె గ్రామ సమీపంలోని బహుదానదిలో మంగళవారం ఐదు ఇసుక ట్రాక్టర్లు, రెండు హిటాచీలను పోలీసులు సీజ్ చేశారు. 'అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై జిల్లా పోలీసు అధికారులు స్పందించారు. తవ్వకాలపై ఆరా తీశారు. మైనగుండ్లపల్లె గ్రామ సమీపంలోని బహుదానదిలో ఇసుక తవ్వకాలపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఐదు ఇసుక ట్రాక్టర్లు, రెండు హిటాచీలను స్వాధీనం చేసుకుని వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించినట్టు తెలిసింది.

ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ ఆన్..!



చిత్తూరులో ట్రాఫిక్ సిగ్నల్ పడడంతో రోడ్డుపై ఆగిన వాహనాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను ఎట్టకేలకు అధికారులు ప్రారంభించారు. మంగళవారం నుంచి నగరంలోని సిగ్నల్ లైట్లు పనిచేస్తూ కనిపించాయి. ట్రాఫిక్ నియంత్రణకు గత ఏడాది సిగ్నల్ లైట్లను మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినా ఆ తరువాత వీటిని అధికారులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు వీటిని ప్రారంభించారు. అయితే రోడ్ల విస్తరణ జరగకపోవడంతో నగరంలో ఇరుకైన రోడ్లపై అర నిమిషం సిగ్నల్ పడితే వాహనాలు ఆగిపోయి రద్దీగా మారుతోంది. మరోవైపు ఉదయం 9 గంటల నుంచే ఎండలు మండిపోతుండటంతో మోటార్ సైక్లిస్టులకు ఇది ఇబ్బందికరంగా మారుతోంది. కొందరు వాహన చోదకులకు వీటిపై అవగాహన లేకపోవడంతో ఎటు వైపు వెళ్లాలో తెలియడం లేదు. సిగ్నల్ వద్ద సమయాన్ని కుదించడం , ప్రజలకు అవగాహన కల్పించడంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూ ఆక్రమణలపై విచారణ

సదుం: భూ ఆక్రమణలపై విచారణ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ స్థానిక తహసీల్దార్ హుస్సేన్‌కు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. బాధితుడి వివరాల మేరకు..మండల కేంద్రంలోని కల్లూరు రోడ్డుకు చెందిన హేమాద్రి తన ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలంతో పాటు సీతమ్మ చెరువు నుంచి పెద్ద కాలువకు నీటిని సరఫరా చేసే సప్లై చానల్, వీరభద్రస్వామి ఆలయానికి చెందిన 0.37 ఎకరాల భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని గత నెలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు అందినట్టు బాధితుడు మంగళవారం తెలిపారు.

ప్రశాంతంగా రాయితీ రుణాల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

చిత్తూరు అర్బన్: బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొదటిరోజు 824 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఇంటర్వ్యూల నిమిత్తం నగరపాలక కార్యాలయ ఆవరణలో ప్రత్యేక హెల్ప్ డెస్క్, కౌంటర్లు ఏర్పాటు చేశారు. నగరంలోని 38 బ్యాంకులకు చెందిన అధికారులు అభ్యర్థుల దరఖాస్తులు, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఏయే యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తుదారులు ఆసక్తి కలిగి ఉన్నారు? వాటిపై వారికి ఎంతమాత్రం అవగాహన ఉందో అధికారులు ప్రధానంగా తెలుసుకున్నారు. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ పర్యవేక్షించారు. మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఇక, నగరంలోని 26 నుంచి 50 వార్డులకు సంబంధించిన దరఖాస్తుదారులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, మంగళవారం హాజరుకాని వాళ్లు సైతం హాజరుకావచ్చని కమిషనర్ తెలిపారు.

కొనసాగుతున్న మహిళా సాధికారత వారోత్సవాలు



చిత్తూరు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సాధికారత వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో పిల్లలకు ×సోషల్ మీడియాలో మహిళల రక్షణ–గోప్యత కోసం డిజిటల్ భద్రత, ప్రజా స్థలాల్లో మహిళల భద్రత–సవాళ్లు–పరిష్కారాలు÷ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈనెల 8వ తేదీ వరకు మహిళల్ని చైతన్యం చేస్తూ ఈ కార్యక్రమాలు కొనసాగిస్తామని ఎస్పీ మణికంఠ తెలిపారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చిత్తూరు - పూతలపట్టు :
95539 55610